క్లుప్తంగా

స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

అద్దంకి: స్థానిక అద్దంకి పోలీస్ స్టేషన్‌ను ఆదివారం చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. సీఐకి తగు సూచనలు చేశారు. తరువాత పట్టణంలోని నామ్ రహదారిలో ట్రాఫిక్‌ను పరిశీలించారు. వినాయకచవితి సందర్భంగా జరిగిన గొడవల నేపథ్యంలో ధర్మవరం గ్రామంలో ఏర్పాటు చేసిన పికెట్‌ను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి డ్యూటీ విషయంలో సూచనలు చేశారు.

రెండిళ్లలో బంగారం చోరీ



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో రెండు ప్రాంతాల్లోని ఇళ్లల్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఘటన స్థలానికి సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్‌బాషా చేరుకుని వివరాలు సేకరించారు. సీఐ వివరాల మేరకు.. పట్టణంలో కాకానిపాలెంలోని కాకాని వెంకటేశ్వర్లు ఇంట్లో శనివారం అర్ధరాత్రి నిద్రిస్తుండగా ఇంటి వెనుక వైపునుంచి దొంగలు ఇంటిలోకి ప్రవేశించి బీరువాను పగలగొట్టి అందులోని 18 సవర్ల బంగారాన్ని అపహరించారు. అదేవిధంగా స్థానిక విశ్వభారతి పాఠశాల సమీపంలోని ఉపాధ్యాయుడు బాబూరావు ఇంట్లో కూడా ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో దొంగలు ప్రవేశించి బీరువాలోని సుమారు 25 సవర్ల వరకు బంగారాన్ని దొంగిలించారు. రెండు చోట్ల జరిగిన దొంగతనాలను సీఐ పరిశీలించారు.

సమన్వయంతో పనులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకి రూరల్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎంపీపీ అవిశెన జ్యోతి అన్నారు. ఆదివారం అద్దంకి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో సింగయ్య అధ్యక్షత వహించారు. చక్రాయపాలెం సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఎక్కువ సమాయం తీసుకోకుండా రెండు, మూడు రోజుల్లో అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే చక్రాయపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు మంచి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

టాయ్‌లెట్ కష్టాలు.. !



తహశీల్దారు కార్యాలయం



ఎంపీడీఓ కార్యాలయం

- ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానరాని మరుగుదొడ్లు
- అత్యవసరమైతే తప్పని తిప్పలు
- నీళ్లు తాగటానికి కూడా భయపడుతున్న ఉద్యోగినులు
- సేవల కోసం వచ్చే వారికి తప్పని తిప్పలు

యద్దనపూడి:

బహిరంగ మలమూత్ర విసర్జన గ్రామాల లక్ష్య సాధనే లక్ష్యమని ఊదరగొడుతున్న ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని సాధించే దిశలో ఘోరంగా విఫలమైంది. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ గ్రామాలు వంటి పథకాలు అమలుపరచాలంటూ చెప్తున్న అధికారులు కార్యాలయాల వద్ద ప్రజా మరుగుదొడ్లు నిర్మించటంలో నిర్లక్ష్యం ఉండటంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

> **త్వరలో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తాం..**
>
> 
>
> మరుగుదొడ్లు లేక ప్రజలతో పాటు అధికారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయం మా దృష్టికి వచ్చింది. అందుకే వెలుగు కార్యాలయం పక్కనే ఉన్న ఖాళీస్థలంలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేశాం. అనుమతులు రాగానే వెంటనే నిర్మిస్తాం. అలాగే అన్ని కార్యాలయాల్లో సిబ్బందికి మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.
>
> మహ్మద్ ఆబీద్ జావెద్, ఎంపీడీఓ

కనిపించని పబ్లిక్ టాయిలెట్లు

ప్రభుత్వ కార్యాలయాలు వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాల వద్ద బాత్‌రూమ్‌లు, పబ్లిక్ టాయిలెట్లు లేవు. దీంతో నిత్యం ప్రజలతో పాటు కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది చెప్పుకోలేని బాధతో సతమతమవుతున్నారు. చాలామంది ఆయా కార్యాలయాల్లో పనిచేసే మహిళా సిబ్బంది ఆఫీస్‌కు వచ్చింది మొదలు భోజనం చేసే సమయంలో మినహా ఇంటికి వెళ్లేంత వరకు మంచి నీళ్లు తాగేందుకు కూడా భయపడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఒక్క ప్రభుత్వ కార్యాలయంలోనూ లేదు..

మండల కేంద్రం యద్దనపూడిలో తహశీల్దారు, ఎంపీడీఓ, పీహెచ్‌సీ , వెలుగు, ఎమ్మార్సీ, వ్యవసాయ, హౌసింగ్ పోలీస్‌స్టేషన్ , తదితర కార్యాలయాలు ఒకచోటే ఉంటాయి. ప్రతినిత్యం ఆయా కార్యాలయాలకు వివిధ రకాల సమస్యల పరిష్కరం కోసం వచ్చే ప్రజలతో అన్ని కార్యాలయాలు జనసంద్రంగా ఉంటాయి. ముఖ్యంగా కార్యాలయాల్లో సైతం బాత్‌రూమ్‌లు లేని పరిస్థితి నెలకొంది. దీంతో సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో పాటు కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురుషులైతే ఏదో ఖాళీస్థలంలో పని కానిచ్చేస్తున్నారు.

మహిళల బాధ వర్ణనాతీతం..

కార్యాలయాల సమీపంలో ఆరుబయలు స్థలాలు కూడా లేకపోవటంతో మహిళలు ఊపిరి బిగపట్టి ఉండాల్సిన పరిస్థితి. ఇక ఆయా కార్యాలయాల్లో బాతురూమ్‌లు కూడా లేకపోవటంతో మహిళా సిబ్బంది నీళ్లు తాగటానికి కూడా భయపడుతున్నారు. నీళ్లు తాగితే బాత్‌రూమ్‌కి వెళ్లాల్సి వస్తుందని .. సౌకర్యం లేని చోట ఇబ్బందులు ఎందుకని ఇంటికి వెళ్లేంతవరకూ అవసరం తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా అవసరాల దృష్ట్యా అధికారులు, పాలకులు స్పందించి కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్ఐ, వీఆర్ఓలు కావలెను !



తహశీల్దార్ కార్యాలయం, వేటపాలెం

వేటపాలెం: మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) పోస్టు ఖాళీగా ఉంది. దీనితో పాటు ఐదుగురు వీఆర్ఓల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2021లో ఆర్ఐ బదిలీపై వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆర్ఐ పోస్టు భర్తీ జరగలేదు. తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్ఓల పోస్టులు ఎంతో కీలకం. అయినా మూడేళ్లుగా ఈ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. దీనిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో ఆర్ఐ లేక పోవడం ఏమిటని ప్రజలు ప్రశిస్తున్నారు. అప్పటి ఉంచి వీఆర్ఓ ఆర్ఐ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆర్ఐ వీఆర్వోలను పర్యవేక్షిస్తూ మండలంలో భూముల తగాదాలకు సంబంధించి విచారణ నిర్వహించి ఆ అంశాలను తహశీల్దార్‌కు నివేదిక ద్వారా అందజేస్తారు. అలాగే రేషన్ డీలర్లు ఆర్ఐ పర్యవేక్షణలోనే ఉంటారు. ఐదుగురు వీఆర్ఓలు పోస్టులు ఖాళీగా ఉండటంతో గ్రామస్థాయిలో పనులు సక్రమంగా జరగడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆర్ఐ, వీఆర్ఓ పోస్టులు త్వరతగతిన భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏకగ్రీవంగా యూటీఎఫ్ కార్యవర్గం



కారంచేడులో యూటీఎఫ్ కమిటీ ప్రమాణ స్వీకారం

కారంచేడు: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల శాఖను ఆదివారం ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రం కారంచేడు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు భిక్షాలుబాబు అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. ఈఎన్నికల్లో కారంచేడు మండల శాఖకు గౌరవ అధ్యక్షుడిగా యూ భవానీప్రసాద్, అధ్యక్షుడిగా ఏ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా పావులూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా జీ రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పీ నాగమణి, కోశాధికారిగా ఎస్‌కే మీరావలీ, కార్యదర్శులుగా కే ఆంజనేయులు, కే రాజు, కే శైలజ, డీ రామకృష్ణలను ఎన్నికయ్యారు. మహిళా కమిటీ కన్వీనర్‌గా ఎం ప్రమీల, సీపీఎస్ కన్వీనర్‌గా మాభూసుభానీ, మహిళా కో కన్వీనర్‌గా టీ మార్తమ్మ, కుటుంబ సంక్షేమ కార్యదర్శిగా హుస్సేన్‌సాహెబ్, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా కేశం వెంకటేశ్వర్లు, బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులుగా సీనియర్ నాయకులు భవనం శ్రీనివాసరెడ్డి, రావి పద్మావతిలను కూడా ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వీరందరూ ప్రమాణ స్వీకారం చేసి తమ బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిటీని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

వేడుకగా ఆత్మీయ సమ్మేళనాలు



ఆరామక్షేత్ర విరాళాల దాతలను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండలోని వాసవీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం, కార్తీక సమారాధన ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సత్యనారాయణ వ్రతం, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం కార్తీక వన భోజనాలు నిర్వహించారు. అద్దంకి సీమ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాత శివాలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు జమ్మలమడక హనుమంతరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి చందలూరి మహాలక్ష్మీ అమ్మవారి పీఠం నిర్వాహకుడు కోట లక్ష్మీ నారాయణ బ్రాహ్మణ కుటుంబాలకు ఆశీస్సులు అందించారు. అనంతరం ఆరామ క్షేత్ర విరాళాల దాతలను ఘనంగా సన్మానించారు.

తెలుగు సాహిత్యం చాలా గొప్పది



ప్రణయ సుందరీ పుస్తకాన్ని లైబ్రరీకి బహూకరిస్తున్న రచయిత

చినగంజాం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ అళహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త చుండూరి వెంకటేశ్వర్లు, రాజుబంగారుపాలెం హైస్కూల్ తెలుగు పండితుడు విశ్వేశ్వర శాస్త్రిలు పాల్గొని తెలుగు సాహిత్యం వాటి గొప్పతనం, తెలుగు సాహిత్యంలో ఉన్న చమత్కారమైన అంశాలు, పోతన రాసిన రచనలను వివరించారు. ఈసందర్భంగా చుండూరి వెంకటేశ్వర్లు రాసిన ప్రణయ సుందరి దృశ్యం అనే పుస్తకాన్ని గ్రంథాలయానికి బహూకరించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న కవులకు లైబ్రేరియన్ ఘనంగా సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీడీసీఎల్ నిర్వాహకులు మున్నంవారిపాలెం రామాంజనేయులు రెడ్డి, కొత్తపాలెం నిర్వాహకుడు బ్రహ్మారెడ్డి, కడవకుదురు నిర్వాహకురాలు కోటిక శాంతకుమారి పాల్గొన్నారు.

తీరంలో కార్తీకమాస పూజలు



కార్తీక దీపాల వెలుగుల్లో శివలింగం



చీరాల వాడరేవులో పర్యాటకులతో ఆహ్లాదంగా ఉన్న తీరం

● ఆహ్లాదకరంగా వాడరేవు తీరం

చీరాల టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని వాడరేవు తీరంలో కార్తీక సందడి నెలకొంది. సుదూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవుకు చేరుకుని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. వాడరేవు తీరానికి చీరాల, పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట తదితర ప్రాంతాలతో పాటుగా తెలంగాణా రాష్ట్రం లోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో వాడరేవు నిండిపోయింది. చీరాల వాడరేవుకు అధికసంఖ్యలో పర్యాటకులు వచ్చి ఆనందరంగా తీరంలో గడపడంతో వాడరేవులో సందడి నెలకొంది. రూరల్ ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మెరైన్, సివిల్, ఏఆర్, మెరైన్ పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసం ముగిసేంత వరకు వాడరేవు, రామాపురం సముద్ర తీరప్రాంతాల్లో బందోబస్తు చర్యలు చేపడుతున్నామని ఎస్సైలు తెలిపారు. అలానే జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 19వ కార్తీకమాసం వనసమారాధన, శివారాధన, వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా శివునికి అభిషేకాలు, పూజలు, వ్రతాలు చేశారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అలానే మండలంలోని పురుపాలెంలో బిట్రా వారి వంశావళి ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు.



చెన్నుపల్లి శివాలయంలో నాగేంద్రుడికి పూజలు చేస్తున్న భక్తులు

బల్లికురవ: శివకేశవులకు ప్రీతి పాత్రమైన కార్తీక మాసం సందర్భంగా హరహరమహాదేవ శంభోశంకర అంటూ శివనామ్మరణతో మార్మోగుతున్నాయి. ఆదివారం చెన్నుపల్లి గ్రామంలోని గంగాపార్వతి సమేత పరుసవేదీశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పీ సుబ్రమణ్యశర్మచే శివునికి పంచామృతాలతో అభిషేకం ప్రత్యేక అలంకరణ అమ్మవారికి కుంకుమపూజలు చేపట్టారు.



మలుపులోని గుంతలో వెళ్తున్న ఆటో



పూర్తిగా దెబ్బతిన్న రహదారి

గోతులు.. ప్రయాణికుల వెతలు

- 12 కిలోమీటర్ల మేర అధ్వానంగా రోడ్డు
- పది గ్రామాలకు నలుదిక్కులా కష్టాలు
- మలుపులతో మరీ ప్రమాదం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు

అద్దంకి: గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తాం.. మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని కూటమి నాయకులు చెప్పిన మాటలివి. కాని కిందిస్థాయిలో వెళ్లి చూస్తే ఇది నిజంగా మాటల ప్రభుత్వమేనని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది గ్రామాల ప్రజలు తమ గమ్యాలకు చేరాల్సిన రోడ్డు గోతుల మయంగా మారింది. దాంతో ఆ దారిలో ప్రయాణించాలంటే ఒళ్లుగుల్ల చేసుకోవాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం రాక మునుపు రహదారులు బాగోలేవని తాము అధికారంలోకి వస్తే రహదారులకు మహర్దశ కల్పిస్తామని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రహదారులు విషయం మరిచాడా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని తిమ్మాయపాలంలోని దర్శి ఆర్‌అండ్ బీ రహదారి నుంచి ఉత్తరం వైపుగా రామాయపాలెం, ప్రకాశం జిల్లాలోని బట్లపల్లి, నూజిళ్లపల్లి, మారెళ్ల, తదితర గ్రామాలకు వెళ్లే 12 కిలోమీటర్ల జిల్లా పరిషత్ రహదారి, మొదట్లో తిమ్మాయపాలెం గ్రామంలో వేసిన సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. తిమ్మాయపాలెం శివాలయం మలుపు నుంచి రామాయపాలెం గ్రామంలోనికి వెళ్లే సరికి ఈ రహదారిలో ఐదారు మలుపులున్నాయి. ఈ మలుపుల్లో పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి.

గోతులమయంగా రహదారి.

గతంలో ఈరహదారి పూర్తిగా దెబ్బతిన్న సమయంలో ఆప్పటి ప్రభుత్వం మరమ్మతులు చేయించడంతో ప్రయాణానికి ఇబ్బంది లేకుండా పోయింది. మళ్లీ మరమ్మతులు చేయని ప్రాంతంలో గోతులు ఏర్పడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. పెద్దపెద్ద గోతులతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రతి రోజూ ఈ రహదారి నుంచి వందలాది ఆటోలు, బైకులు, ట్రాక్టర్లు ఇతర వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఇంత రద్దీగా రహదారికి మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **ఆటోలు కూడా రావడం లేదు..**
>
> 
>
> తిమ్మాయపాలెం గ్రామం నుంచి రామాయపాలెం వెళ్లే రహదారి గోతుల మయంగా మారింది. మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. కనీసం ఏ పనికైనా ఆటోను పిలిచినా అమ్మో ఆ దారిలోనా మేము రామని అంటున్నారు. దాంతో మా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
>
> – ఉప్పలూరి సాంబిరెడ్డి, రామయపాలెం

> **మరమ్మతులైనా చేయాలి..**
>
> 
>
> మా గ్రామం వెళ్లే రహదారి పూర్తిగా గోతుల మయమైంది. ద్విచక్రవాహనం వెళ్లాలన్నా కష్టంగా ఉంది. మూల మలుపుల వద్దే పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రహదారి పొడవునా గోతులున్నాయి. పది గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.
>
> – రావుపల్లి గోపి, రామాయపాలెం

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న హనుమత్ షిర్డీ సాయిబాబా అనుగ్రహ ధ్యాన మందిర 15వ వార్షికోత్సవం ఆదివారం కనులపండువగా వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ఇంకొల్లు మధుబాబు బృందంచే ఉదయం 5 గంటలకే బాబావారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, మధ్యాహ్నం హారతి, సాయంత్రం, రాత్రి హారతి, పల్లకీ సేవ చేపట్టారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాలైన బల్లికురవ, కొత్తపాలెం, గుంటుపల్లి, అంబడిపూడి, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొణిదెన, మల్లాయపాలెం గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేపట్టారు.

మైక్ సెట్ బహూకరణ



మైక్ సెట్ అందజేస్తున్న దివాకరదత్తు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో ఆదివారం సీనియర్ రొటేరియన్, సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, జ్యోతిష్మతి సౌజన్యంతో అద్దంకి శాఖా గ్రంథాలయానికి మైక్ సెట్ బహూకరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మల్లాది శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతిచంద్రమౌళి, లైబ్రేరియన్ సుగుణరావు పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక లైబ్రరీలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. దానిలో భాగంగా గ్రంథపాలకుడు విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక బీసీ వసతి గృహ వార్డెన్ ఏ చెన్నకేశవులు, అవధానులు, ఆర్ శ్రీనివాసాచార్యులు, కే సత్య శివలక్ష్మణ శ్రీకాంత్, 29 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ఆడపడుచుల పొంగళ్లు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లికి గ్రామ ఆడపడుచులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. కార్తీకమాసం పురస్కరించుకొని ఆదివారం వేకువజాము నుంచే ఆడపడుచులు పెద్ద ఎత్తున తలంటు స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.



గంగమ్మకు మొక్కులు చేసుకుంటున్న భక్తులు

సమయపాలనతో ఆర్టీసీకి ఆదాయం

చీరాల అర్బన్: బస్సులను సరైన సమయపాలనతో నడిపితే ప్రజల మన్నలతో పాటు ఆర్టీసీకీ కూడా ఆదాయం వస్తుందని డిపో మేనేజర్ జె.శ్యామల అన్నారు. ఆర్టీసీలో సమయపాలన మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆదివారం ప్రకటనలో తెలిపారు. నెల రోజులు పాటు నిర్వహించే మాసోత్సవాల్లో డిపో పరిధిలోని రూట్లలో ప్రయాణించే ఆర్టీసీ బస్సులను సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

25 మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి రూరల్: అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న మహిళ నుంచి 25 మద్యం బాటిళ్లను ఆదివారం ఎక్సైజ్ సీఐ భవాని స్వాధీనం చేసుకున్నారు. సీఐ వివరాల మేరకు.. మండలంలోని కుంకుపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ గ్రామంలో అక్రమం మద్యం అమ్ముతున్న సమాచారంతో ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి ఆమెను అదుపులోకి, కేసు నమోదు చేశారు.

వాహనదారులకు తప్పిన ప్రమాదం

చీరాల అర్బన్: చీరాల ఆర్వోబీపై ఆదివారం వాహనదారులకు ప్రమాదం తప్పింది. చీరాల నుంచి కారంచేడు వైపు వెళ్లే ట్రాక్టర్ ఆర్వోబీపై హైడ్రాలిక్ పైపు తెగిపోయింది. దీంతో ఆయిల్ లీకై రోడ్డుపై పడడంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడ్డారు. అయితే ఎవరికి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో కొంత సమయం పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది